ఆన్‌లైన్ పెట్టుబడి పేరుతో

రూ.13.50 లక్షలు బురిడీ

కుంభమేళాకు వెళ్లి వస్తూ తప్పిపోయి

నర్సాపూర్ డ్రైనేజీలో బయటపడి

7



సంగారెడ్డిలోని బీసీ గురుకుల పాఠశాలలో కేక్ కట్ చేస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి

బాలికలు ఉన్నత లక్ష్యాలను సాధించాలి

- న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్

సంగారెడ్డి అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : బాలికలు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని సాధించేందుకు కృషిచేయాలని సంగారెడ్డి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్ సూచించారు. సంగారెడ్డి కల్వకుంట రోడ్డులోని బీసీ గురుకుల పాఠశాలలో జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, మిషన్ శక్తి, జిల్లా మహిళా సాధికారత కేంద్రం శుక్రవారం సంయుక్తంగా నిర్వహించిన జాతీయ బాలిక దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బాలికలు ఉన్నత చదువులు చదువుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం బాలికలతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో గాయత్రీదేవీ, సీడబ్ల్యూసీ సభ్యుడు వెంకటేశం, ఆర్‌సీవో గౌతం, ప్రిన్సిపాల్ రజిని, డీసీపీవో రత్నం, జిల్లా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ పల్లవి, విద్యార్థినులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు

సంగారెడ్డి, సదాశివపేట వార్డు సభల్లో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



సంగారెడ్డిలో నిర్వహించిన వార్డుసభలో మాట్లాడుతున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



సదాశివపేటలో నిర్వహించిన వార్డుసభలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికర్జున ఖర్గే సారథ్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నేతృత్వంలో శుక్రవారం సంగారెడ్డి పట్టణంలోని 27, 28. 11, 13 వార్డుల్లో సభల నిర్వహణను పర్యవేక్షించిన టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకుందన్నారు. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం మరోసారి అవకాశం ఇచ్చిందన్నారు. దరఖాస్తు చేసుకోని వారి కోసం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కూన సంతోష్‌కుమార్, మహేశ్, ప్రదీప్, శశి, తులసీరామ్, మణికొరెడ్డి, దయాకర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, విజయ్, రాజు, కౌన్సిలర్ ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ, వార్డు సభల్లో దరఖాస్తులు

73,356

- ముగిసిన గ్రామ, వార్డు సభలు
- జాబితాల్లో పేర్లు రానివారి ఆందోళన
- భారీగా కొత్త దరఖాస్తులు

సంగారెడ్డి టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహించిన గ్రామసభలు శుక్రవారం ముగిసాయి. ఈ నెల 21 నుంచి 24 వరకు జరిగిన సభల్లో 73,356 దరఖాస్తులు వచ్చాయి. రేషన్ కార్డుల కోసం 43,992 దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం 11,192, రైతు భరోసా కోసం 13,593, ఇందిరమ్మ ఆత్మీ భరోసా కోసం 4,575 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. నాలుగో రోజు గ్రామసభలు కూడా నిరసనలు, నిలదీతలతోనే కొనసాగాయి.

639 గ్రామ సభలు

సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా 639 గ్రామసభలు, మున్సిపాలిటీల పరిధిలో 196 వార్డుసభలు నిర్వహించారు. మున్సిపాలిటీల పరిధిలో తొలిరోజు 47, రెండోరోజు 55, మూడోరోజు 53, చివరి రోజు 41 వార్డుసభలు జరిగాయి. అలాగే, పంచాయతీల పరిధిలో తొలిరోజు 182 గ్రామసభలు, రెండోరోజు 181, మూడోరోజు 162, చివరి రోజు 114 గ్రామసభలు నిర్వహించారు.

చివరిరోజు 28,238 దరఖాస్తులు

చివరి రోజు జరిగిన 835 గ్రామ సభల్లో మొత్తం 28,238 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో 636 గ్రామ సభల్లో 19,288 దరఖఖాస్తులు వచ్చాయి. ఇందులో రేషన్ కార్డుల కోసం 12,950, ఇందిరమ్మ ఇళ్ల కోసం 4,347 దరఖాస్తులు, రైతు భరోసా కోసం 612, ఆత్మీయ భరోసా కోసం 1,379 దరఖాస్తులు అందాయి. కాగా ఎనిమిది మున్సిపాలిటీల్లో 196 వార్డు సభలు జరుగగా 8,950 దరఖాస్తులు వచ్చాయి. రేషన్ కార్డుల కోసం 603 అర్జీలు, ఇందిరమ్మ ఇళ్ల కోసం 2,839, రైతు భరోసా కోసం 22, ఆత్మీయ భరోసా కోసం 54 దరఖాస్తులు వచ్చాయి.



కొండాపూర్‌లో గ్రామసభను తనిఖీ చేస్తున్న సంగారెడ్డి కలెక్టర్‌క్రాంతి

పక్కాగా వివరాల నమోదు

మెదక్/హవేళిఘణపూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లావ్యాప్తంగా 469 గ్రామ పంచాయతీలు, నాలుగు మున్సిపాలిటీల పరిధిలోని 75 వార్డుల్లో సభలు జరిగాయి. 21న 166 గ్రామాలు, 21 వార్డులు, 22న 146 గ్రామాలు, 21 వార్డులు, 23న 130 గ్రామాలు, 21 వార్డులు, 24న 17 గ్రామాలు, 12 వార్డుల్లో సభలు నిర్వహించారు. గ్రామసభలు ముగియడంతో సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు, కొత్త దరఖాస్తులు, అభ్యంతరాలకు సంబంధించిన డాటాను ఆన్‌లైన్ నమోదు చేసే ప్రక్రియ కొనసాగుతున్నది. హవేళిఘణపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో కొనసాగుతున్న డాటా నమోదు ప్రక్రియను శుక్రవారం కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామసభల్లో వచ్చిన ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం స్థానిక డైట్ కాలేజీలో తసీల్దార్, ఎంపీడీవో, కార్యాలయాల ఏర్పాటుకు భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తసీల్దార్ సింధురేణుక, ఎంపీడీవో రవీశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



హవేళిఘణపూర్‌లో డేటాఎంట్రీని పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

నేటి నుంచి సీపీఎం రాష్ట్ర మహాసభలు

తొలిసారి వేదికైన సంగారెడ్డి.. ముమ్మరంగా ఏర్పాట్లు

నేటి బహిరంగసభకు బృందాకారత్, రాఘవులు, తమ్మినేని

రేపు, ఎల్లుండి ప్రతినిధుల సభలు, చర్చలు

28న సీపీఎం నూతన రాష్ట్ర కార్యదర్శి, కార్యవర్గం ఎన్నిక



సంగారెడ్డిలో సీపీఎం రాష్ట్ర మహాసభల నిర్వహణకు స్వాగత ఏర్పాట్లు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 24: భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) మహాసభలకు తొలిసారిగా సంగారెడ్డి జిల్లా కేంద్రం వేదికైంది. నేటి నుంచి 28వ తేదీ వరకు అట్టహాసంగా సభలను నిర్వహించడానికి జిల్లా బాధ్యులు సమాయత్తమయ్యారు. మహాసభల నేపథ్యంలో జాతీయ, రాష్ట్ర ముఖ్య నేతలతో పాటు తెలంగాణ నలుమూలల నుంచి సీపీఎం శ్రేణులు ఎర్రని దండులా కదలిరానున్నారు. నేడు సంగారెడ్డి ఐబీ గెస్ట్‌హౌస్ నుంచి ప్రారంభమయ్యే ర్యాలీతో రాష్ట్ర మహాసభలకు శ్రీకారం చుట్టబోతున్నారు.

కదిలొస్తున్న ఎర్రదండు

నాలుగు రోజులపాటు జరిగే సీపీఎం మహాసభలకు రాష్ట్రం నలుమూలల నుంచి ఆ పార్టీ శ్రేణులు తరలిరానున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక 4వ సారి జరిగే మహాసభలకు సంగారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తోంది. సభలకు వచ్చే అతిథులు, ప్రతినిధులు, ఇతర నేతలకు వసతి, బస కూడా ఏర్పాటు చేశారు. నేడు ఉదయం పట్టణంలోని ఐబీ గెస్ట్‌హౌస్ నుంచి బహిరంగ సభ నిర్వహించే పీఎస్‌ఆర్ గార్డెన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. బహిరంగ సభకు భారీగా జనసమీకరణ చేపట్టారు. సభకు కేంద్ర పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కారత్, బీవీరాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరవుతున్నారు. 26న జరిగే ప్రతినిధుల సభకు సీపీఎం జాతీయ సమన్వయకర్తగా వ్యవహరిస్తున్న పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్ కారత్ హాజరవుతున్నారు. 27న పార్టీ కార్యచరణ, సాగించిన పోరాటాలపై చర్చ వేదికలు కొనసాగించనున్నారు. ఇక ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో కళాకారుల ఆటపాటలు, కళారూపాల ప్రదర్శనలు అదనపు ఆకర్షణగా నిలవనున్నాయి.

రాష్ట్ర కార్యవర్గంపై ఆసక్తి

సంగారెడ్డి కేంద్రంగానే సీపీఎం పార్టీ రాష్ట్ర నూతన కార్యదర్శితోపాటు కార్యవర్గాన్ని ఈనెల 28వ తేదీన ఎన్నుకుంటారు. ప్రస్తుతం తమ్మినేటి వీరభద్రం కార్యదర్శిగా ఉన్నారు. ఆయన స్థానంలో కొత్త కార్యదర్శి ఎవరైతారనే విషయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. మహాసభల చివరిరోజు నివేదిక సమర్పిస్తారు. అనంతరం పార్టీ ప్రతినిధులు రాష్ట్ర కమిటీ సభ్యులను ఎన్నుకుంటారు. రాష్ట్ర కమిటీ సభ్యులు కార్యదర్శిని ఎన్నుకునే ప్రక్రియతో మహాసభలు ముగుస్తాయి. కాగా మహాసభలను విజయవంతం చేసేందుకు జిల్లా బాధ్యులు శ్రమిస్తున్నారు. ఈ సభల నేపథ్యంలోనే గురు, శుక్రవారాల్లో పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద కళాకారులు ప్రదర్శనలు చేపట్టారు. ప్రముఖ కళాకారుడు, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న తన గాత్రంతో అలరించారు. సంగారెడ్డి చుట్టూ పరిశ్రమలు విస్తరించి ఉండడంతో కార్మిక వర్గాల్లోనూ అవగాహన కల్పిస్తున్నారు. జనసందోహం నడుమ సభలను సక్సెస్ చేసేలా ప్రయత్నిస్తున్నారు.

చట్టపరంగా చర్యలు తీసుకుంటాం

పటాన్‌చెరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడికి కారకులపై కేసులు

- కొందరు రెచ్చగొట్టడంతోనే పరిస్థితి చేయిదాటింది
- మల్టీ జోన్ ఐజీ సత్యనారాయణ



విలేకరులతో మాట్లాడుతున్న మల్టీజోన్ ఐజీ సత్యనారాయణ

పటాన్‌చెరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై గురువారం కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు దాడి చేసిన ఘనటపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని మల్టీజోన్ ఐజీ సత్యనారాయణ పేర్కొన్నారు. పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన సంగారెడ్డి ఎస్పీ రూపేష్‌తో కలిసి సందర్శించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడి ఘటనపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు తెలుసుకునే అవకాశం అందరికీ ఉంటుందని, ఆందోళనలు హింసాత్మక ఘటనలకు దారితీస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నిన్న కార్యకర్తలు అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసనలు తెలుపుతున్న క్రమంలో కొందరు నాయకులు రెచ్చగొట్టడంతోనే హఠాత్తుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంవైపు పరిగెత్తారని తెలిపారు. ఈ ఘటనలో ప్రత్యక్షంగా పాల్గొన్నవారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు. ఘటన మరింత తీవ్రం కాకుండా పోలీసులు సకాలంలో స్పందించారని పేర్కొన్నారు. ఆందోళనలు, నిరసనలు తెలిపే సందర్భాల్లో నాయకులు సంయమనం పాటించాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కల్పించేలా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు

పటాన్‌చెరు పారిశ్రామికవాడలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మల్టీజోన్ ఐజీ సత్యనారాయణ తెలిపారు. పటాన్‌చెరు పోలీసుస్టేషన్‌లో రికార్డులను ఆయన తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. పారిశ్రామికవాడలో శాంతిభద్రతల పరిరక్షణపై ఐజీ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ గతేడాది స్టేషన్ పరిధిలో 18 దోపిడీలు జరిగితే ఇందులో 17 కేసులు ఛేదించామని తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కార్మికుల వల్ల జరిగిన నేరాలు, బాలికలపై జరిగిన లైంగిక దాడులపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించి ఆరు పోక్సో ఎన్‌బీడబ్ల్యూలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. శివారు ప్రాంతాల్లో జాతీయ రహదారిపై రాత్రిపూట ట్రాఫిక్‌జాం నివారించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. పరిశ్రమలకు వచ్చే భారీ వాహనాలు, క్రేన్‌ల వల్ల ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా ని తెలిపారు. రియల్‌ఎస్టేట్ పేరుతో నేరాలు, ల్యాండ్‌గ్రాబింగ్, డబుల్‌రిజిస్ట్రేషన్లు, బౌన్సర్లను పెట్టుకుని భయపెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొత్తగా ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు రావడంతో నేరాలను అదుపు చేయడం సులభమవుతుందన్నారు. సమావేశంలో డీఎస్పీ రవీందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ వినాయకొరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాశాఖలో 10 మంది స్పౌజ్ బదిలీలు

పాఠశాలలకు కేటాయిస్తూ ఉత్తర్వులు

సంగారెడ్డి అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యాశాఖలో స్పౌజ్ బదిలీలు పూర్తయ్యాయి. 317 జీవో కారణంగా పలువురు ఉపాధ్యాయ దంపతులు వేర్వేరు జిల్లాలకు బదిలీ అయిన విషయం తెలిసిందే. వీరికి స్పౌజ్ బదిలీల ద్వారా ఒకే జిల్లాలో పనిచేసేలా అవకాశం కల్పిస్తూ మంత్రివర్గ ఉపసంఘం అవకాశం కల్పించిన విషయం విధితమే. ఇందులో భాగంగా స్పౌజ్ బదిలీలకు దరఖాస్తులు స్వీకరించారు. వీరిలో 10 మందికి సంగారెడ్డి జిల్లాలో ఆయా పాఠశాలల్లో పోస్టింగులు ఇస్తూ డీఈవో వెంకటేశ్వర్లు ఉత్తర్వులు ఇచ్చారు. బదిలీ అయినవారిలో ఓ జీహెచ్‌ఎం, ముగ్గురు ఎస్జీటీలు, ఆరుగురు స్కూల్ అసిస్టెంట్లు ఉన్నారు.

నేడు పాలకవర్గ చివరి సమావేశం

సంగారెడ్డిలో రేపటితో ముగియనున్న కౌన్సిల్ పాలన

ప్రత్యేక అధికారిగా అదనపు కలెక్టర్

ఐదేళ్లలో రూ.60.49కోట్ల అభివృద్ధి పనులు



6

'ఉపాధి' ఉద్యోగులకు వేతనాలేవి?

రెండు నెలలుగా అందని జీతాలు

ఎఫ్ఏలకు మాత్రమే నెలనెలా చెల్లింపు

మిగతావారికి మొండిచెయ్యి



7

హెల్మెట్ పెట్టు.. సేఫ్‌గా ప్రయాణించు..

రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రవాణాశాఖ ఆధ్వర్యంలో మెదక్‌లో నిర్వహించిన బైక్‌ర్యాలీలో కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి హెల్మెట్ ధరించి బైక్‌పై ప్రయాణించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనదారులు అతివేగాన్ని నియంత్రించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. హెల్మెట్ లేకుండా బైక్‌పై ప్రయాణించొద్దని పేర్కొన్నారు. హెల్మెట్ ఉంటేనే పెట్రోల్ పోయాలనే నిబంధనను జిల్లావ్యాప్తంగా ఉన్న పెట్రోల్ బంకుల్లో అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్లలో ప్రయాణించే సమయంలో సీటు బెల్టు ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. ర్యాలీలో అదనపు కలెక్టర్ మెంచు నగేష్, జిల్లా రవాణా శాఖాధికారి వెంకటస్వామి, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

-మెదక్ అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి)





రుణమాఫీ కోసం బ్యాంకు ఎదుట రైతుల ఆందోళన

అన్ని అర్హతలున్నా రుణమాఫీ రాలేదని శివ్వంపేట మండలం గుండ్లపల్లి రైతులు బ్యాంకు ఎదుట ఆందోళన చేశారు. గ్రామానికి చెందిన 120 మంది రైతులకు అన్ని అర్హతలున్నా రుణమాఫీ రాలేదని ఆగ్రహం వ్యక్తంచేస్తూ శుక్రవారం దొంతి యూనియన్ బ్యాంకు ఎదుట నిరసన తెలిపారు. రుణమాఫీ, పెన్షన్ డబ్బులను ఇతర లావాదేవీల కింద పట్టుకోవద్దని డిమాండ్ చేశారు.

-శివ్వంపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి)

తెలంగాణలోనే గురుకులాల వ్యవస్థ

- విద్యార్థినుల ఆత్మహత్యల నివారణకు ఎనానిమస్ రూం కాన్సెప్ట్
- ప్రతీ గురుకులానికి ఇన్‌చార్జిగా అదనపు కలెక్టర్
- గురుకులాల సొసైటీ కార్యదర్శి అలుగు వర్షిణి



అందోలు గురుకులంలో విద్యార్థినులతో మాట్లాడుతున్న అలుగు వర్షిణి

జోగిపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థినుల కోసం గురుకులాలను నడపడం తెలంగాణలో తప్ప మరెక్కడా లేదని సాంఘిక సంక్షేమ గురుకులాల సొసైటీ కార్యదర్శి ఐఏఎస్ అలుగు వర్షిణి పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి ఆమె అందోలు పట్టణంలోని సాంఘిక సంక్షేమ విద్యార్థినుల గురుకులంలో బస చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గురుకులాల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ఇటీవలే ప్రభుత్వం నూతన మెనూను అమలులోకి తెచ్చిందని, కాస్మొటిక్ చార్జీలను కూడా పెంచిందని తెలిపారు. ఇటీవల గురుకులాల్లో విద్యార్థినులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలపై విచారణలో పలు విషయాలు వెలుగుచూశాయని తెలిపారు. ఇంట్లో ఘర్షణలు, బంధువుల్లో కానీ, ఆటోడ్రైవర్లు, ఇతరుల వల్ల లైంగిక వేధింపులకు గురై ఇంట్లోవారికి చెప్పలేక కుమిలిపోతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని

మిగతా 8వ పేజీలో..

సంగారెడ్డిలో నేడు పాలకవర్గ చివరి సమావేశం

- రేపటితో ముగియనున్న మున్సిపల్ కౌన్సిల్ పాలన
- ఐదేళ్లలో రూ.60.49కోట్లతో అభివృద్ధి
- ప్రత్యేక అధికారిగా అదనపు కలెక్టర్

సంగారెడ్డి టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మున్సిపల్ పాలకవర్గం శనివారం చివరిసారిగా సమావేశం కానున్నది. నేడు ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మి అధ్యక్షతన సాధారణ సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ ప్రసాద్ చౌహాన్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ పాలక వర్గాల పాలన రేపటితో ముగియనున్నది. 2020 జనవరి 27న ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టిన కౌన్సిల్ సభ్యులు ఈనెల 26 నుంచి నిష్క్రమించనున్నారు. ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్‌తో పాటు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యుల పదవీ కాలం ముగియనున్నది. మూడు దఫాలుగా సంగారెడ్డి మున్సిపాలిటీకి హ్యాట్రిక్ ఛైర్‌పర్సన్‌గా బొంగుల విజయలక్ష్మి కొనసాగుతున్నారు. ఐదేళ్లుగా పాలకవర్గం వివిధ అభివృద్ధి పనులను చేపట్టగా, గ్రూపు తగాదాలు నెలకొన్నాయి. సొంత పార్టీ నేతలే ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టగా కోరం సభ్యులు లేక వీగిపోయింది. తదనంతర పరిణామాల నేపథ్యంలో ఛైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మి కాంగ్రెస్‌లో చేరారు.

642 పనులు పూర్తి

సంగారెడ్డి గ్రేడ్ వన్ మున్సిపాలిటీ పరిధిలో ఐదేళ్ల పాలనలో రూ.60.49 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. పట్టణంలోని 38వ వార్డుల్లో మురుగు కాల్వలు, రోడ్లు, విద్యుదీకరణ, తాగునీరు తదితర పనులు పూర్తి చేశారు. 2019 నుంచి 2025 వరకు వివిధ స్కీంల ద్వారా మొత్తం 1097 పనులకుగానూ రూ.60.49 కోట్లతో 642 పనులు పూర్తి చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఐదేళ్లల్లో పట్టణ ప్రగతి కింద రూ.15.95 కోట్లతో 357 పనులు, 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.6.52 కోట్లు, ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం కింద రూ.53 లక్షలు, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కింద రూ.1.30 కోట్లు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.61 కోట్లు, స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ ద్వారా రూ.22.35 కోట్లు, ఎన్‌సీపీ నిధుల నుంచి రూ.3.06 కోట్లు, టీయూఎఫ్ఐడీసీ కింద రూ.9.15 కోట్లతో పలు పనులనే చేపట్టారు.

15 ఏళ్ల పాలన సంతృప్తినిచ్చింది



నేను సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టి ప్రజలకు సేవ చేయడం సంతృప్తిగా ఉంది. సంగారెడ్డి గ్రేడ్ వన్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా మూడు పర్యాయాలు.. 15 ఏళ్ల పాటు పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నాను. పట్టణ ప్రగతి బాటలో భాగస్వామిని కావడం ప్రజలు ఇచ్చిన అవకాశంగా, పట్టణ అభివృద్ధి కోసం సహకరించిన తోటి కౌన్సిలర్లు, అధికారులు, ప్రజా ప్రతినిధులందరికీ ధన్యవాదాలు.

- బొంగుల విజయలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్



శనివారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని నారాయణఖేడ్‌కు చెందిన లీఫ్ ఆర్టిస్టు శివకుమార్ ఆకుపై భారతదేశం, బ్యాలెట్ నమూనా, ఓటు హక్కు చిత్రాలను మలిచారు.

- నారాయణఖేడ్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి)

జోగిపేట ఏరియా ఆస్పత్రిలో
మందుబాబు హల్‌చల్

గడ్డిమందు తాగివచ్చానని వైద్యం అందించలేదని ఆరోపణ

జోగిపేట, జనవరి24 (ఆంధ్రజ్యోతి) : జోగిపేట ఏరియా ఆస్పత్రిలో ఓ మందుబాబు హల్‌చల్ చేశాడు. వివరాల్లోకి వెళితే.. పుల్కల్ మండలం ఎస్.ఇటిక్యాలకు చెందిన మొగులాన(మౌలానా) గురువారం రాత్రి జోగిపేట ఏరియా ఆస్పత్రికి వచ్చాడు. కుటుంబ తగాదాలతో గడ్డిమందు తాగానని, తనకు వైద్యం చేయాలని హడావిడి చేశాడు. వైద్యం చేసేందుకు డాక్టర్లు నిరాకరించినట్లు అతడి బంధువు ఆరోపిస్తున్నారు. అయితే, మొగులాన మద్యం సేవించి వచ్చాడని, దీంతో మొదటగా అతడు ఏమి తాగారో తెలియలేదని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌజన్య పేర్కొన్నారు. ప్రథమ చికిత్స చేసిన తరువాత మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేశామని ఆమె వివరించారు.

సంగారెడ్డి విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్‌లో పురస్కారాలు



మార్షల్ ఆర్ట్స్ పురస్కారాన్ని అందుకుంటున్న విద్యార్థి విశ్వేశ్వర్

సంగారెడ్డి అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణానికి చెందిన పలువురు విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్‌లో అత్యుత్తమ పురస్కారాలు దక్కాయి. హైదరాబాద్‌లోని బిర్లామందిర్ సైన్స్ మ్యూజియంలో కేశవ్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమంలో ఎం.రిత్విక్, ఎం.విశ్వేశ్వర్ ఇంటర్నేషనల్ రైజింగ్ స్టార్ మార్షల్ ఆర్ట్స్ పురస్కారాలు అందుకున్నారు. దేశ నలుమూలలతో పాటు 14 దేశాల నుంచి మార్షల్ ఆర్ట్స్‌కు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఇంతటి ఉత్తమ పురస్కారాలు విద్యార్థులకు దక్కడం పట్ల శిక్షకుడు పోచయ్య, తల్లిదండ్రులు, క్రీడాకారులను పలువురు అభినందించారు.

అమీన్‌పూర్‌లో ఆక్రమణలపై సమగ్ర సర్వే..!

కాలనీలవాసులు ఆందోళన చెందొద్దు : హైడ్రా

హైదరాబాద్ సిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు లే అవుట్లలో పార్కులు, ఖాళీ స్థలాలు, రహదారుల ఆక్రమణలపై సమగ్ర సర్వే నిర్వహించనున్నట్టు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. కొన్ని లే అవుట్ల యజమానులు హైడ్రా సర్వే అంటూ స్థానికులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, అలాంటి అవాస్తవ ప్రచారం నమ్మొద్దని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో సూచించారు. అమీన్‌పూర్‌లోని గోల్డెన్ కీ వెంచర్స్ యజమాన్యం తమ ప్లాట్లు ఆక్రమించారని వెంకటరమణ కాలనీవాసులు గతంలో హైడ్రాకు ఫిర్యాదు చేశారు. పరిసర ప్రాంతాల్లోని ఇతర కాలనీల వాసులు ఆక్రమణలపై ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కొన్నాళ్ల క్రితం సర్వే నంబర్ 152, 153లోని వెంకటరమణ కాలనీ పార్కులు, రహదారులు కబ్జాకు గురైనట్టు క్షేత్రస్థాయి సర్వేలో నిర్ధారించారు. కాలనీలోకి చొరబడి గోల్డెన్ కీ వెంచర్స్ ఆక్రమణలకు పాల్పడినట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. దీనిపై మరింత లోతైన సర్వే చేయించేందుకు హైడ్రా సిద్ధమైంది. సర్వే ఆఫ్ ఇండియా, ఏడీ సర్వే విభాగంతో కలిసి సంయుక్తంగా సర్వే చేయాలని భావిస్తున్నారు. మునిసిపాలిటీ పరిధిలోని ఫిర్యాదులందిన కాలనీలు, లే అవుట్లలో సమగ్ర సర్వే నిర్వహించాలని నిర్ణయించారు. అందరి సమక్షంలో పారదర్శకంగా సర్వే నిర్వహిస్తామని, స్థానికులు భాగస్వాములు కావాలని రంగనాథ్ కోరారు. పలు ఆరోపణల నేపథ్యంలో గోల్డెన్ కీ సంస్థ ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అటాచ్ చేసింది. ఆర్టీసీ కాలనీ, రంగారావు వెంచర్, చక్రపురి కాలనీ వాసులు కూడా కబ్జాలుంటే ఫిర్యాదు చేయాలని, సమగ్ర సర్వేలో వారిని కూడా భాగస్వామ్యం చేస్తామని పేర్కొన్నారు. మున్సిపాలిటీల పరిధిలోని కాలనీలవాసులు ఆందోళన చెందాల్సిన పని లేదని, హైడ్రా కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు.

బిల్లు కట్టలేదని కరెంటు కట్

ట్రాన్స్‌కో ఏఈతో లక్ష్మాపూర్ గ్రామస్థుల వాగ్వాదం

రామాయంపేట, జనవరి 24 ఆంధ్రజ్యోతి) : బిల్లు బకాయి కట్టడం లేదంటూ కనెక్షన్ తొలగించగా.. మీటర్ ధ్వంసం చేశారంటూ గ్రామస్థులు ట్రాన్స్‌కో అధికారితో వాగ్వాదానికి దిగిన ఘటన శుక్రవారం రామాయంపేట సబ్‌స్టేషన్‌లో జరిగింది. మండల పరిధి లక్ష్మాపూర్‌లో గురువారం బిల్లుల వసూలుకు వెళ్లిన ట్రాన్స్‌కో సిబ్బంది బకాయి ఉన్న పలువురి ఇళ్లల్లోని కనెక్షన్‌ను కట్ చేశారు. దీంతో రాత్రంతా అంధకారంలో ఉన్నామని.. పిల్లల చదువులకు ఆటంకం ఏర్పడిందని గొడవపడ్డారు. అయితే మీటర్ ధ్వంసం చేయాల్సిన అవసరం తనకు లేదని అధికారి వివరణ ఇచ్చినా వినకపోవడంతో తిరిగి కొత్త మీటర్ బిగించడంతో సమస్య సద్దుమణిగింది.

మెదక్ చర్చిలో ఐక్యతా ప్రార్థనలు

మెదక్ కల్చరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మెదక్ సీఎస్ఐ చర్చిలో శుక్రవారం నేషనల్ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్ ఇన్ ఇండియా ఆధ్వర్యంలో ఐక్యతా ప్రార్థన నిర్వహించారు. ఈ సమావేశంలో అన్ని సంఘాలకు చెందిన పాస్టర్‌లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి బిషప్ రూబెన్ మార్క్స్, శాంతయ్య, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



కొవ్వొత్తులు పట్టుకుని ప్రార్థనలో పాల్గొన్న చర్చిల పాస్టర్‌లు

క్రైం కార్నర్

కొండపోచమ్మ ప్రాజెక్టు
కెనాల్‌లో పడి యువకుడి మృతి

● చేపలు పడుతుండగా ఘటన.. మృతుడు మధ్యప్రదేశ్ కూలీ



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

వర్గల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : చేపల వేటకు వెళ్లిన యువకుడు కొండపోచమ్మ ప్రాజెక్ట్ కెనాల్‌లో పడి మృతిచెందిన సంఘటన వర్గల్ మండలం సింగాయిపల్లి గ్రామ సమీపంలో చోటుచేసుకున్నది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రం చెనవాడ జిల్లా ఒనమజ్‌వాడి గ్రామానికి చెందిన అయికాస్(26) సిమెంట్ బ్రిక్స్ తయారు చేయడంలో లేబర్ పని చేస్తుంటాడు. గురువారం రాత్రి సింగాయిపల్లి గ్రామ సమీపంలోని కొండపోచమ్మ ప్రాజెక్టు కెనాల్‌లో చేపల వేట కోసం వెళ్లాడు. ప్రమాదవశాత్తు కెనాల్‌లో పడి నీట మునిగి మృతిచెందాడు. శుక్రవారం మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు నుంచి కింద పడిన యువకుడు..
తెగిపడిన రెండు కాళ్లు



చికిత్స పొందుతున్న యువకుడు

రామచంద్రాపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : రైలు ప్రమాదంలో ఓ యువకుడు రెండు కాళ్లు కోల్పోయిన ఘటన తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రైల్వేలైన్‌పై శుక్రవారం చోటు చేసుకున్నది. కొల్లూరు పోలీసుల కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం గుల్బార్గాకు చెందిన సలీం(31) వికారాబాద్‌లో సికింద్రాబాద్ రైలు ఎక్కాడు. రైలు తెల్లాపూర్ మీదుగా వెళుతుండగా సలీం ప్రమాదవశాత్తు రైల్లోంచి కిందపడ్డాడు. అతడి రెండు కాళ్లు పట్టాల కిందకు వెళ్లడంతో సలీం కాళ్లు తెగిపడ్డాయి. రైలు అలాగే ముందుకు సాగింది. తీవ్ర రక్తం స్రావం జరగగా, బాధితుడిని పోలీసులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

గడ్డి కటర్ మిషన్‌లో ఇరుక్కుని తెగిన చేతి వేళ్లు

నంగునూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పొలం వద్ద గడ్డి కటర్ మిషన్ లో చేతు ఇరుక్కొని నాలుగు వేళ్ళు రెండు ఇంచుల వరకు తెగిపోయిన సంఘటన నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలో చోటు చేసుకుంది. ఎందుకు సంబంధించి 108 సిబ్బంది ఈఎంటి రమేశ్, పైలట్ ప్రభాకర్ తెలిపిన కథనం మేరకు పాలమాకుల గ్రామానికి చెందిన డేగల నర్సింలు అనే రైతు తన వ్యవసాయ పొలం వద్ద ఆవులకు మేత కోసం గట్టి కట్టర్ మిషన్ లో గడ్డిని వేస్తున్న క్రమంలో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో అతని ఎడమ చేతి నాలుగు వేళ్ళు రెండు ఇంచుల వరకు కట్ అయిపోయాయి. ప్రమాద విషయాన్ని కుటుంబ సభ్యులు 108 కు ఫోన్ చేయడంతో ఈఎంటి రమేష్, పైలట్ ప్రభాకర్ లు సంఘటన స్థలానికి చేరుకుని అంబులెన్స్‌లో ప్రథమ చికిత్స అందించి, స్థానిక సిద్దిపేట ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు వారు తెలిపారు.

కారు, బైక్ ఢీ.. ఒకరికి గాయాలు

● దగ్ధమైన బైక్



ప్రమాదంలో కాలిపోయిన బైక్

హత్నూర, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : కారు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో బైక్ దగ్ధం కాగా.. ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. హత్నూర మండల పరిధిలోని బోర్పట్ల గ్రామానికి చెందిన కాసాల చిరంజీవి, తన పల్సర్ బైక్‌పై పల్పనూరు గ్రామ సమీపంలోని పెట్రోల్ పంపు వద్దకు వెళ్తుండగా, పల్పనూరు శివారుకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న కారు బలంగా ఢీకొట్టింది. పల్సర్ బైక్ రోడ్డుపై రాసుకుంటూ వెళ్లడంతో స్పార్క్ వచ్చి మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో చిరంజీవికి గాయాలు కాగా.. చికిత్స నిమిత్తం సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు.

పర్వేద పెద్దమ్మ ఆలయం చోరీ కేసులో
ఇద్దరికీ ఆరు నెలల జైలు

కోహెడ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : కోహెడ మండలం పర్వేద గ్రామంలో పెద్దమ్మతల్లి ఆలయంలో చోరీ చేసిన ఇద్దరు నిందితులకు శుక్రవారం ఆరు నెలల జైలు శిక్ష పడినట్లు ఎస్ఐ అభిలాష్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం కోహెడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పరివేద గ్రామంలో 2024 మార్చి 8న పెద్దమ్మ ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగలగొట్టి బంగారు పుస్తెలు, వెండి వస్తువులు, హుండీలోని నగదును ఎత్తుకెళ్లారు. గ్రామ మాజీ ఉపసర్పంచ్ పొన్నం అంజయ్య పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన బోదాసు యాదగిరి, దూల్మిట్ట మండల కేంద్రానికి చెందిన ఆలెపు శేఖర్‌ను అరెస్టు చేసి హుస్నాబాద్ కోర్టులో హాజరుపరిచారు. హుస్నాబాద్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కేసు విచారించి ఇద్దరికీ 6 నెలల జైలు శిక్షను విధించినట్లు ఎస్ఐ చెప్పారు. నేరస్థులను పట్టుకోవడానికి కీలకపాత్ర పోషించిన ఎస్ఐ అభిలాష్, కోర్టు కానిస్టేబుల్ సంజీవ్‌ను పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ, ఏసీపీ సతీష్‌లు అభినందించారు.

కుంభమేళాకు వెళ్లి వస్తూ తప్పిపోయి..
నర్సాపూర్ డ్రైనేజీలో బయటపడి



డ్రైనేజీలో ఉన్న వ్యక్తిని బయటకు తీస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ తదితరులు

నర్సాపూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మెదక్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి కుంభమేళాకు వెళ్లి తిరిగి వస్తూ నర్సాపూర్‌లో దిగి తప్పిపోగా, వారం తర్వాత డ్రైనేజీలో నుంచి బయటపడి తిరిగి కుటుంబీకుల వద్దకు చేరిన ఘటన ఇది. పోలీసులు, కుటుంబీకుల వివరాల ప్రకారం.. మెదక్ మండలం అవుసలపల్లికి చెందిన నాగారం మల్లేశం(56) ఆరు రోజుల క్రితం కుంభమేళాకు వెళ్లి తప్పిపోయాడు. కాగా కుంభమేళా నుంచి బస్సులో తిరిగి వస్తూ నర్సాపూర్‌లో ఈ నెల 18న దిగాడు. కాస్త మతిస్థిమితం లేని మల్లేశం కుటుంబీకులకు ఫోన్ చేసి తనను ఎవరో తరుముతున్నారని నర్సాపూర్‌లో తప్పిపోయానని చెప్పి పెట్టేశాడు. ఆ తర్వాత ఫోన్ పనిచేయకపోవడంతో కంగారు పడ్డ కుటుంబీకులు నర్సాపూర్‌కు వచ్చి పోలీసులకు సమాచారమిచ్చి పట్టణంతో పాటు సమీప ప్రాంతాల్లో వెతికారు. కాగా శుక్రవారం ఉదయం జాతీయరహదారి పక్కన అజయ్ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న పెద్ద అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలో పైకి కేవలం మనిషి చేతి వేళ్లు మాత్రమే కనిపిస్తూ ఉండటంతో అక్కడే ఉన్న కొందరు అదే కాంప్లెక్స్‌లో ఉండే మాజీ మున్సిపల్ చైర్మన్ మురళీధర్‌యాదవ్‌కు సమాచారం ఇవ్వడంతో అక్కడకు చేరుకున్నారు. స్థానికులతో కలిసి డ్రైనేజీపై కప్పును తొలగించి అందులో ఉన్న వ్యక్తిని బయటకు తీశారు. అయితే డ్రైనేజీలో ఎన్నిరోజులుగా ఉన్నాడో వివరాలు తెలియ లేదు. ఎలాంటి గాయం లేకుండా బయటపడ్డాడు. అతడిని పోలీస్‌స్టేషన్ తీసుకెళ్లగా మల్లేశం అని తేలింది. కుటుంబీకులకు సమాచారం ఇచ్చి పోలీసుల సహాయంతో వారికి అప్పగించారు.

విఠల.. విఠల.. పాండురంగ

ఖేడ్ నుంచి పండరీపూర్‌కు ప్రారంభమైన మాఘవారి దిండి యాత్ర



పండరీపూర్‌కు పాదయాత్రగా బయలుదేరుతున్న కరణ్‌గజేంద్రభారతి

నారాయణఖేడ్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని పండరీపూర్ క్షేత్రానికి మాఘవారి కోసం శుక్రవారం నారాయణఖేడ్ నుంచి అంతర్గాం పీఠాధిపతి కరణ్‌గజేంద్ర భారతి మహరాజ్ ఆధ్వర్యంలో వేలాది మంది భక్తులతో దిండియాత్ర బయలు దేరి వెళ్లింది. ఏకాంబ పీఠాధిపతి అవదూత్ మహరాజ్ సైతం పాదయాత్రలో పాల్గొన్నారు. భక్తులు తలలపై కళశాలు, తులసీ కోటలు ఉంచి విఠల.. విఠల.. పాండురంగా అంటూ భజనలు కీర్తనల నామస్మరణతో బయలు దేరారు. ఈ యాత్ర దాదాపు 300 వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న పండరీపూర్‌కు 10 రోజుల్లో చేరుకుంటుంది. పాదయాత్ర జి.హుక్రాన గ్రామానికి చేరుకోగానే ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి పాల్గొని కరణ్‌గజేంద్ర మహరాజ్‌ను సన్మానించారు.

శంభో శివ శంభో

దుద్దెడ శంభు ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ఆలయం చుట్టూ తిరుగుతున్న ఎడ్ల బండ్లు

కొండపాక, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : కాకతీయుల కాలం నాటి పురాతన ప్రాశస్త్యం కలిగిన దుద్దెడ శ్రీస్వయంభూ శంభు లింగేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలలో మొదటి రోజు గణపతి పూజతో కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం బ్రహ్మోత్సవాలలో అపూర్వఘట్టమైన శకటోత్సవం కొనసాగింది. ఆలయం చుట్టూ ఎడ్లబండ్లు, వాహనాలు తిరిగాయి. ఆలయ సేవా సమితి ట్రస్ట్ చైర్మన్ మంచాల శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.



గుమ్మడిదలలోని కోల్డ్‌స్టోరేజ్ భవనం

వృథాగా కోల్డ్‌స్టోరేజ్



దొంగలు ఎత్తుకెళ్లిన జనరేటర్

గుమ్మడిదల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదలలో నిర్మించిన కోల్డ్ స్టోరేజీ నిరుపయోగంగా మారింది. మండల పరిధిలో కూరగాయల సాగు ఎక్కువ శాతం మంది రైతులు పండిస్తున్నారని నాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.32లక్షల కేంద్ర ప్రభుత్వ నిధులతో కోల్డ్ స్టోరేజ్ భవనాన్ని నిర్మించారు. దీంతో కూరగాయల పంటలను ఎక్కువ రోజులు నిల్వఉంచుకోవచ్చని, గిట్టుబాటు ధర దొరికినపుడు అమ్ముకోవచ్చని అనుకున్న రైతులు ఆశలు అడియాశలుగానే మిగిలిపోయాయి. అయితే, కోల్డ్ స్టోరేజీకి కావాల్సిన పరికరాలు కొన్ని లేకపోవడంతో ఇది వినియోగంలోకి రాలేదు. ఆ సమయంలో హార్టికల్చర్ అధికారులు పెద్దగా పట్టించుకోకపోవడంతో ప్రారంభానికి నోచుకోలేదు. దీనిని వినియోగంలోకి తీసుకురావాలని ఈ ప్రాంత రైతులు ఎన్నోమార్లు మొర పెట్టుకున్నా లాభం లేకుండాపోయింది. ప్రస్తుతం కోల్డ్‌స్టోరేజీ ఒకింత రేకులు ఎగిరిపోయి, గోడలకు పగుళ్లు వచ్చి శిథిలావస్థకు చేరుతుంది. కోల్డ్ స్టోరేజ్ కోసం ఏర్పాటుచేసిన కొత్త జనరేటర్ దొంగలపాలైంది. ప్రస్తుతం పండించిన పంటలకు ధర రాక, అందుబాటులో కోల్డ్‌స్టోరేజ్ లేక పంటను రోడ్లపై పారబోస్తూ, చేలలోనే పశువులకు మేతగా వేస్తున్న రైతులున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కోల్డ్‌స్టోరేజ్‌ను అందుబాటులోకి తీసుకొస్తే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

ప్రభుత్వ పట్టింపులేక నిరుపయోగం



ఉమ్మడి రాష్ట్రంలో రైతులు బాగుండాలని, లాభాలు పొందాలని కోల్డ్‌స్టోరేజ్‌ను నిర్మిస్తే ప్రభుత్వాలు పట్టింపులేనితనంతో నిరుపయోగంగా మారింది. హార్టికల్చర్ అధికారుల నిర్లక్ష్యంతో భవనం ప్రారంభానికే నోచుకోలేదు. ఎన్నోమార్లు ప్రజాప్రతినిధులకు, జిల్లా వ్యవసాయ అధికారులకు అందుబాటులోకి తీసుకురావలని విన్నవించినా ప్రయోజనం లేదు. కలెక్టర్ స్పందిస్తే అందుబాటులోకి వస్తుంది.

- మద్దుల బాల్‌రెడ్డి, సంగారెడ్డి జిల్లా రైతు సమాఖ్య ఉపాధ్యక్షుడు

ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి

గుమ్మడిదలలో కూరగాయల రైతుల కోసం ఉమ్మడి రాష్ట్రంలో కోల్డ్ స్టోరేజ్ భవనం నిర్మించిన విషయం వాస్తవమే. కొన్ని కారణాలతో కోల్డ్‌స్టోరేజ్ వినియోగంలోకి రాలేదు. హార్టికల్చర్ అధికారుల సహకారంతో రైతులకు అందుబాటులోకి తీసుకరావడానికి ప్రయత్నిస్తున్నాం. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి.

- శైలజారెడ్డి, హార్టికల్చర్ ఆఫీసర్, పటాన్ చెరు డివిజన్



ధర లేక రోడ్లపై పారబోసిన టమోటాలు

గణతంత్ర వేడుకలకు
పకడ్బందీ ఏర్పాట్లు

● కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అన్ని శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొటోకాల్ పాటించాలన్నారు. వివిధ శాఖల ద్వారా శకటాలు, స్టాళ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థులతో దేశభక్తి గీతాలపై నృత్య ప్రదర్శనలు, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులతో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కలెక్టరేట్‌లో ఈ-ఆఫీస్ విధానం అమలు చేయాలని, పేపర్‌పై పని తగ్గించాలన్నారు. ప్లాస్టిక్ రహిత కార్యాలయాన్ని తయారు చేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్‌ను ఆదా చేయాలన్నారు.

ఓటు.. ప్రతీ పౌరుడి ప్రాథమిక హక్కు

● సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

నారాయణఖేడ్, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : ఓటు హక్కు ప్రతీ పౌరుడి ప్రాథమిక హక్కు అని కలెక్టర్ వల్లూరి క్రాంతి అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని నారాయణఖేడ్ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం మనదే అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో అశోక చక్రవర్తి, తహసీల్దార్ భాస్కర్, ప్రిన్సిపల్ మహేశ్వర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'శాంతిభద్రతలతోనే అభివృద్ధి సాధ్యం'

నాగల్‌గిద్ద, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : శాంతిభద్రతలతోనే అభివృద్ధి సాధ్యమని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, ఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం నాగల్‌గిద్ద మండల పరిధిలోని మోర్గి చౌరస్తాలో నూతనంగా నిర్మించిన పోలీస్‌స్టేషన్ భవనాన్ని ఎస్పీ రూపేష్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుమూల మండలమైన నాగల్‌గిద్దను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. మండలంలో పరిశ్రమలను ఏర్పాటు చేయడానికి అనువైన స్థలాలను కూడా పరిశీలించామన్నారు. ఎస్పీ రూపేష్ మాట్లాడుతూ వేసవి కాలంలో ఈ ప్రాంత యువకులకు ప్రత్యేకంగా పోలీసు సిబ్బంది చేత శిక్షణా తరగతులను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానన్నారు. ఖేడ్‌ప్రాంత వాసులు అత్యధికంగా పోలీసు కొలువులను దక్కించుకున్నారన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా అదనపు ఎస్పీ సంజీవ్‌రావు, ఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మోర్గి చౌరస్తాలో పోలీస్‌స్టేషన్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, ఎస్పీ తదితరులు

చెట్టు తొలగిస్తుండగా రైతు మృతి



బీరప్ప (ఫైల్)

వెల్దుర్తి, జనవరి24(ఆంధ్రజ్యోతి) : చెట్టును తొలగిస్తుండగా ఓ రైతు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ఆరెగూడెం గ్రామ శివారులో శుక్రవారం రాత్రి చోటుచేసుకున్నది. ఆరెగూడెం గ్రామ శివారులోని ఓ పొలం వద్ద ఎక్స్‌కవేటర్ సహాయంతో చెట్టును తొలగిస్తున్నారు. అక్కడే ఉన్న అదే గ్రామానికి చెందిన కొడె బీరప్ప (45)పై చెట్టు పడడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం మెదక్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. బీరప్పకు భార్య సుగుణ, కుమారుడు ఉన్నారు. అలాగే చెట్టు పడడంతో ఎక్స్‌కవేటర్ ధ్వంసమైంది.

ఆన్‌లైన్ పెట్టుబడి పేరుతో
రూ.13.50 లక్షలు బురిడీ

పటాన్‌చెరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ పెట్టుబడి పేరుతో ఓ ప్రైవేటు ఉద్యోగికి సైబర్ నేరగాళ్లు రూ.13.50 లక్షల నగదును కుచ్చుటోపీ పెట్టిన ఉదంతం పటాన్‌చెరు పోలీసుస్టేషన్ పరిధిలో నమోదైంది. ఇన్‌స్పెక్టర్ వినాయక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు శాంతినగర్‌లో నివాసం ఉండే నాంపల్లి సత్యనారాయణ ప్రైవేటు ఉద్యోగి కాగా, గత సంవత్సరం నవంబర్ 28న ఫెడిలిటీ ఇంటర్‌నేషనల్ గ్రూపు పేరుతో ఏర్పాటు చేసిన వాట్సాప్ గ్రూపులో చేరాలని ఒక లింక్‌ను పంపారు. తాము చెప్పినట్లు షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే పెద్ద ఎత్తున లాభాలు వస్తాయని నమ్మించారు. నేరగాళ్ల గారడీ మాటలు నమ్మి అత్యాశతో పలు దఫాలుగా హెచ్‌డీఎఫ్‌సీ, ఎస్‌బీఐలోని తన బ్యాంకు ఖాతాల నుంచి మొత్తం 13,58,700 నగదును వ్యాట్సాప్ గ్రూపులో వారు సూచించిన ఖాతాలకు బదిలీ చేశాడు. అసలు, లాభాలు తన ఖాతాకు జమ చేయాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినా అటువైపు నుంచి స్పందన కరువైంది. తాము మోసపోయామని గ్రహించి గురువారం 1930 సైబర్ క్రైం సెల్‌కుఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పటాన్‌చెరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

నేడు అమీన్‌పూర్‌లో సైబర్ నేరాల నివారణపై సదస్సు

నేడు అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడా బాలాజీ ఫంక్షన్‌హాల్‌లో సైబర్ నేరాలపై పోలీసులు పట్టణ ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ నరేష్ పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్‌పీ, సంగారెడ్డి ఎస్పీ రూపేష్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహిస్తారు. సైబర్ నేరాలతో పాటు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, దొంగతనాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. సదస్సుకు పెద్దఎత్తున పట్టణ ప్రజలు హాజరు కావాలని కోరారు.

సర్కారు బడులకు 'ఎఫ్‌ఎల్‌ఎన్' కిట్లు

● సామర్థ్యాల మెరుగుకు బోధనోపకరణాలు సరఫరా
● సంగారెడ్డి జిల్లాకు 324 కిట్లు మంజూరు, పంపిణీ



సంగారెడ్డికి కేంద్రానికి చేరుకున్న ఎఫ్‌ఎల్‌ఎన్ కిట్లు

సంగారెడ్డి అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల సామర్థ్యాలు మెరుగుపర్చేందుకు విద్యాశాఖ రెండేళ్లుగా ఎఫ్‌ఎల్‌ఎన్(తొలిమెట్టు) కార్యక్రమాన్ని అమలు చేస్తున్నది. సమగ్ర శిక్ష ద్వారా ఐఐటీ గాంధీ నగర్ వారు రూపొందించిన ప్రత్యేక కిట్లను రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు సరఫరా చేయగా, సంగారెడ్డి జిల్లాకు సైతం కిట్లు చేరాయి. జిల్లా వ్యాప్తంగా 1215 ప్రభుత్వ పాఠశాలలుండగా, ఇందులో సుమారు లక్షా 3 వేల మంది విద్యనభ్యసిస్తున్నారు. అయితే ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు తొలిమెట్టు, ఉన్నత పాఠశాలల్లో ఉన్నతి కార్యక్రమాలను విద్యాశాఖ అమలు చేస్తూ వస్తున్నది. ఆయా కార్యక్రమాలు అమలు చేసినా విద్యార్థుల్లో ఆశించిన స్థాయిలో సామర్థ్యాలు మెరుగుపడటం లేదని విద్యాశాఖ గుర్తించి బోధనోపరకణాలతో అందించడానికి ముందుకొచ్చింది. జిల్లాలోని 290 ప్రాథమిక పాఠశాలలకు ఎఫ్‌ఎల్‌ఎన్ వండర్‌బాక్సులు, 17 కేజీబీవీలకు సైన్స్, మ్యాథ్స్ క్యూరియాసిటీ బాక్సులు అందించనున్నారు. త్వరలో ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఖోజీ బాక్సులు అందజేయనున్నారు. ఇలా ఉండగా జిల్లాకు చేరిన 324 ఎఫ్‌ఎల్‌ఎన్ కిట్లు శుక్రవారం నుంచి ఆయా పాఠశాలలకు చేరవేశారు. కిట్లను సద్వినియోగం చేసుకుంటే సామర్థ్యాలు మెరుగుపడుతాయని, మెరుగైన ఫలితాలు వస్తాయని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

'ఉపాధి' ఉద్యోగులకు వేతనాలేవి?

● రెండు నెలలుగా అందని జీతాలు
● ఎఫ్‌ఏలకు మాత్రమే నెలనెలా చెల్లింపు
● మిగతా వారికి మొండిచేయి



ఉపాధి హామీ ఉద్యోగులు

జోగిపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : రెండు నెలలుగా వేతనాలు రాకపోవడంతో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖలోని ఉపాధి హామీ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. జీతాలు చెల్లించకపోవడంతో తమ కుటుంబాలను పోషించుకోలేకపోతున్నామని వాపోతున్నారు.

మెదక్ జిల్లాలో 424 మంది ఉద్యోగులు

ఉపాధి హామీ విభాగంలో మెదక్ జిల్లా వ్యాప్తంగా 424 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇందులో 16 మంది అసిస్టెంట్ ప్రోగ్రాం సిబ్బంది(ఏపీవో), 14 మంది ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు(ఈసీ), 48 మంది కంప్యూటర్ ఆపరేటర్లు(సీవో), 346 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు(ఎఫ్ఏ)లు ఉన్నారు. ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్(ఎఫ్‌టీవో)లో ప్రతీ నెలా వేతనాలను జనరేట్ చేసి పంపుతారు. తద్వారా వారందికీ వారివారి బ్యాంకు ఖాతాల్లో జీతాలు పడేవి. అయితే, ఎఫ్‌టీవో జనరేట్ చేసి పంపుతున్నా డిసెంబర్ మాసం నుంచి జీతాలు వారి బ్యాంకు ఖాతాలో జమ కావడం లేదు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు చెల్లింపు

ఇదే విభాగంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు(ఎఫ్ఏ)లకు మాత్రం ప్రతీ నెలా వేతనాలు అందుతున్నాయి. ఉపాధిహామీలో ఉండే వర్క్స్ ఫండ్ నుంచి వీరికి వేతనాలు అందజేస్తారు. ప్రతీ నెలా ఎస్టిమేషన్ చార్జెస్‌లో ఇంజనీరింగ్ ఛార్జెస్ కింద కొంత మొత్తాన్ని పక్కనబెట్టి వాటిని వేతనంగా అందిస్తారు. దీంతో వారికి నెలనెలా వేతనాలు కరెక్టుగా అందుతున్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి వేతనాలు అందజేసి, తమను ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించాలని చిరుద్యోగులు వేడుకుంటున్నారు.

ఎప్పటికప్పుడు ఎఫ్‌టీవో జనరేట్ చేసి పంపుతున్నాం



ఉపాధి హామీ ఉద్యోగుల వేతనాలను ఎప్పటికప్పుడు ఎఫ్‌టీవో జనరేట్ చేసి పంపుతున్నాం. అయినా రావడం లేదన్న విషయం నా దృష్టికి రాలేదు. తొందరలోనే వేతనాల చెల్లింపు జరుగుతుండొచ్చు.

- జ్యోతి, మెదక్ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి

గ్రామాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే గూడెం


తాగునీటి రిజర్వాయర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఇటీవల నియోజకవర్గంలోని పలు మున్సిపాలిటీలలో విలీన మైన గ్రామాలల అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి హామీ ఇచ్చారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీలో ఇటీవల విలీనమైన కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడ, ఐలాపూర్, ఐలాపూర్‌తండా, సుల్తాన్ పూర్, దాయర గ్రామాలలో శుక్ర వారం రూ.2.38 లక్షల కొత్త పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు పటేల్‌గూడలో నిర్మించిన తాగునీటి మినీ రిజర్వాయర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నందారం నర్సింహగౌడ్, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ దండ్లసునీతసత్యనారాయణ, మాజీ సర్పంచ్‌లు నితీశ్‌శ్రీకాంత్, కృష్ణ, భాస్కర్‌గౌడ్, మల్లేష్, జలమండలి జీఎం సుబ్బారాయుడు, మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.అలాగే పట్టణంలోని అబ్దుల్‌కలాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిం చిన జాబ్‌మేళాను ఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డి ప్రారంభించి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. కార్య క్రమంలో ప్రిన్సిపాల్ వడ్లూరిశ్రీనివాస్, ప్రవీణ తదిత రులు పాల్గొన్నారు.

కేసీఆర్ ఏడుపాయలను దర్శించుకోనేలేదు

● మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు


మెదక్ మున్సిపాలిటీలో యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

హవేళిఘణపూర్ /మెదక్ మున్సిపాలిటీ, జనవరి24 (ఆంధ్రజ్యోతి) : మాజీ సీఎం కేసీఆర్ పదేళ్ల అధికారంలో ఉండి ఒక్కసారి కూడా ఏడుపాయాల దుర్గమాతను దర్శించుకోలేదని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు తెలిపారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో అభి వృద్ధి పనులు, ఫరీద్‌పూర్ గ్రామంలో కొత్తగా నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం భవనాన్ని, సీసీ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా లోని పవిత్ర పుణ్యక్షేత్రం ఏడుపాయాల వనదుర్గమాతను సంవత్సర కాలంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దర్శించుకున్నారన్నారు. కార్య క్రమంలో తహసీల్దార్ సింధురేణుక, పీఆర్ అధికారి సర్దా ర్‌సింగ్, పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, పరశురాం గౌడ్, మజీ సర్పంచ్ శ్రీకాంత్, అక్బర్, పీఎసీఎస్ చేర్మేన్ బ్రహ్మం, నాయకులు రాము, గణేష్, పోశెట్టి, రిజ్వాన్, తదితరులు పాల్గొన్నారు. అలాగే మెదక్ పట్టణంలోని వివిధ వార్డు లలో రూ. 2.26 కోట్ల పనులకు ఆయన భూమిపూజలు, ప్రారంభోత్సవాలు చేశారు. జిల్లా కేంద్రంలో రూ. 84 లక్ష లతో నిర్మించిన మాడల్ యానిమల్ బర్త్ కంట్రోల్ సెంట ర్‌తో పాటు, రూ. 40 లక్షలతో నిర్మించిన వీధి వ్యాపారుల దుకాణ సముదాయాన్ని ప్రారంభించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్, కమీషనర్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్‌చైర్మన్ రాగి అశోక్, కౌన్సిలర్లు, నాయకులు బొజ్జపవన్, ఉప్పల రాజేష్, లక్ష్మీనారాయణ గౌడ్, సమియొద్దీన్, రాజలింగం, వసంతరాజు, గంగాధర్, ఉమర్, హఫీజొద్దీన్, ఆంజనేయులుగౌడ్, కావేటి రవి తది తరులు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తి తీర్చడమే లక్ష్యం

● ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి


అమృత్ పథకానికి శంకుస్థాపన చేసిన ఎంపీ, ఎమ్మెల్యే

నారాయణఖేడ్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రజల దాహార్తి తీర్చ డమే తమ లక్ష్యమని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, నారాయణ ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. అమృత్ 2.0 పథకంలో భాగంగా రూ.13.50 కోట్లతో స్థానిక ఆర్టీసీ బస్సు డిపో వెనుక భాగంలో సంపు, జర్నలిస్టు కాలనీ, ఆక్సిజన్‌పార్కు, ఏరియా వైద్యశాల ఆవరణల్లో ట్యాంకుల నిర్మాణ పనులకు శుక్రవారం కలెక్టర్ వల్లూరిక్రాంతితో కలిసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో అధనపు కలెక్టర్ చంద్రశే ఖర్, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం


లక్ష్మి(ఫైల్)

కల్హేర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మహిళ అదృశ్యమైంది. వివరాల్లోకి వెళ్లితే కల్హేర్ ఉమ్మడి మండల పరిధిలోని నాగ్‌ధర్ గ్రామానికి చెందిన రామన్నగారి లక్ష్మి(53) మానసిక పరిస్థితి సరిగా లేదు. ఈ నెల 20న ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. బంధు మిత్రుల వద్ద వెతికినా ఫలితం లేకపోవ డంతో కుమారుడు శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశం తెలిపారు.

గౌతమీనగర్‌లో యువతి..


సోని(ఫైల్)

పటాన్‌చెరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): యువతి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పట్టణంలోని గౌతమీనగర్‌లో శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ప్రైవేటు ఉద్యోగం చేసే సోని (19) యథావిధిగా గురువారం రాత్రి ఇంట్లో భోజనం చేసి పడుకుంది. తెల్లవారుజామున 4గంటల సమయంలో తల్లిదండ్రులు లేచి చూడగా గదిలో కనిపించలేదు. బంధుమిత్రుల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు శుక్రవారం సాయంత్రం పటాన్‌చెరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సీసీరోడ్డు ప్రారంభం

ఐడీఏబొల్లారం జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఐడీఏబొల్లారం మల్లన్నబస్తీ, గాంధీనగర్ కాలనీలలో నిర్మించిన సీసీరో డ్డులను మున్సిపల్ చైర్మన్ రోజాబాల్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఐదేళ్లగా వందల కోట్లతో అభివృద్ధి పనులు చేశామని చెప్పారు. సీసీరోడ్లు, మురుగునీటి వ్యవస్థ, కాలుష్య కాసారాల్లో మిషన్ భగీరథ నీరు వంటి ప్రాథమిక సౌకర్యాలు కల్పించామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీకాంత్‌యాదవ్, చంద్రయ్య, గోపాలమ్మ, ఏఈ కిష్టయ్య, రజిత, శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

కల్హేర్, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మార్డి జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను సంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమావేశం ఏర్పాటు చేసి విద్యా బోధన, ఉపాధ్యాయుల హాజరు, వారి పనితీరు పట్ల సమీక్ష నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం లక్ష్మణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత శిక్షణ

సంగారెడ్డి రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతులు, మహిళలకు ఉపాధి పొందేలా వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణనివ్వనున్నట్టు సహారా ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ నిర్వాహకురాలు ఆసిఫా బేగం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టైలరింగ్, బ్యూటీ పార్లర్, కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ఈ కోర్సుల్లో చేరేవారు 18 నుంచి 26 సంవత్సరాల వయస్సు కలిగి పదవ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హత గల వారు తమ వెంట విద్యార్హతలు గల ధృవపత్రాలు, ఆధార్ కార్డు, ఫొటోతో సంగారెడ్డిలోని రైతు బజార్ ఎదురుగా గల సంస్థ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. పూర్తి వివరాలకు 8309940165 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

దొంతిలో కాంగ్రెస్ నేతల ఆందోళన

శివ్వంపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని దొంతి గ్రామంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా గాంధీ విగ్రహం చుట్టూ శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు వైట్‌కు బదులు గులాబీ రంగు వేశారు. దీనికి నిరసనగా కాంగ్రెస్ నాయకులు గాంధీ విగ్రహం వద్ద రాత్రి ఆందోళనకు దిగారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భవనగారి శ్రీను, సుక్క శ్రీను, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన గ్రామ, వార్డు సభలు



కొల్చారం : పైతర గ్రామంలో నిర్వహిస్తున్న గ్రామసభ, హత్నూర : శేర్ఖాన్‌పల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

పుల్‌కల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల అమలుకై నిర్వహిస్తున్న గ్రామసభలు శుక్రవారం ముగిసాయి. చివరి రోజు మండల కేంద్రం చౌటకూర్, శివంపేట, వెంకటకిష్టాపూర్‌లలో సభలు నిర్వహించారు. ఆయా గ్రామసభల్లో తహసీల్దార్ మన్నె కిరణ్‌కుమార్, ఎంపీడీవో ఆనందమేరీ, ఎంపీవో శ్రీకాంత్, పంచాయతీ రాజ్ ఏఈఈ శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

హత్నూర : గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు పర్చాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. హత్నూర మండల పరిధిలోని శేర్ఖాన్‌పల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా పాలన గ్రామసభకు హాజరై మాట్లాడారు. అర్హుల జాబితా తయారు చేయడంలో ఎందుకు తాత్సారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దరఖాస్తుల పేరుతో ప్రజలను మోసం చేయడం తగదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, ఐబీ ఏఈఈ భూపుత్ర తదితరులు పాల్గొన్నారు.

● నర్సాపూర్ : శుక్రవారం నర్సాపూర్ మండలం పెద్ద చింతకుంటలో నిర్వహించిన గ్రామసభకు ఎమ్మెల్యే సునీతారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. దీనిపై స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే ప్రసంగాన్ని అడ్డుకోవడంతో ఇరు పార్టీల కార్యకర్తల మధ్య గందరగోళం ఏర్పడింది.

● మునిపల్లి : ప్రజా ప్రభుత్వంలో అర్హులైన వాందరికి సంక్షేమ పథకాలు అందుతాయని సంగారెడ్డి ఆర్డీవో రవీందర్ రెడ్డి తెలిపారు. మండలంలోని పెద్దగోపులారం గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు.

● జహీరాబాద్ : పట్టణంలోని పస్తాపూర్, మహీంద్రాకాలనీ, దత్తాత్రేయ ఆశ్రమం తదితర ప్రాంతాల్లో నిర్వహించిన గ్రామసభలను ఆర్డీవో రాంరెడ్డి శుక్రవారం పరిశీలించారు. జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవోలు మహేందర్‌రెడ్డి, మహేష్, వ్యవసాయ శాఖ ఏడీఏ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

● కొండాపూర్ : గ్రామంలో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాల కింద దరఖాస్తుల చేసుకునేలా విద్యావంతులు, యువకులు, గ్రామ పెద్దలు చొరవ చూపాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి సూచించారు. శుక్రవారం గుంతపల్లి ప్రజాపాలన గ్రామసభకు ఆమె ఆకస్మికంగా పర్యవేక్షించి లబ్ధిదారులతో మాట్లాడారు.

● కంగ్టి : మండల కేంద్రమైన కంగ్టిలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి, దెగుల్‌వాడిలో సబ్ సెంటర్ భవనానికి జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రజా పాలన గ్రామసభలో పాల్గొని వారు మాట్లాడారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి నూతన్‌కుమార్, దిశ కమిటీ మెంబర్ ప్రకాష్‌రాథోడ్, ఎంపీడీవో సత్తయ్య, ఎమ్మార్వో అబ్దుల్ నజీంఖాన్ పీఏసీఎస్ చైర్మన్ మారుతిరెడ్డి, డీఎల్‌పీవో సంజీవ్‌రావు, ఎంపీవో సుభాష్ పాల్గొన్నారు.

● పెద్దశంకరంపేట : పెద్దశంకరంపేటలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామ సభ రసాబాసగా మారింది. అర్హులైన వారికి రేషన్‌కార్డులు, ఇందిరమ్మ గృహాలు రాక పోవడంతో పలువురు అధికారులను నిలదీశారు. అర్హులందరికీ పథకాలు అందుతాయని తహసీల్దార్ గ్రేస్‌బాయ్ సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ రమేష్, పేట పంచాయతీ కార్యదర్శి వెంకటరాములు తదితరులు పాల్గొన్నారు

● కొల్చారం : పైతర గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు మరెల్లి అనిల్, ప్రత్యేక అధికారి శ్వేత కుమారి, ఏఈవో రోజా, పంచాయతీ కార్యదర్శి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం


అన్నారంలో విద్య పై అవగాహన కల్పిస్తున్న యువజన నాయకులు

గుమ్మడిదల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల మండలం అన్నారం గ్రామ పరిధిలో జాతీయ బాలికల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా జరుపుకొన్నారు. మండల యువజన సంఘాల సమితి ఆధ్వర్యంలో ఇటుక బట్టీలలో విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక నాయకుడు మద్ది ప్రతాప్ రెడ్డి, యువజన సంఘం నాయకులు వడ్డే ఎల్లయ్య, మంద భాస్కర్ రెడ్డి, చెన్నం శెట్టి ఉదయ్ కుమార్, హెచ్ఎం రతన్ కిషోర్, సీఆర్‌పీ మురళి తదితరులు పాల్గొన్నారు.

● పెద్దశంకరంపేట : పెద్దశంకరంపేటలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

● సంగారెడ్డి అర్బన్ : జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని సంగారెడ్డి మండలం కొత్లాపూర్‌లోని మహాత్మాజ్యోతి బాపూలే బీసీ గురుకుల పాఠశాలలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, హ్యాపీ డెంటల్ కేర్ సంయుక్తంగా దంత వైద్య శిబిరం శుక్రవారం ఏర్పాటు చేశారు. డాక్టర్ శిల్ప 332 మంది బాలికలకు పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం దంతాలు ఆరోగ్యంగా ఉన్న బాలికలకు ప్రశంసా పత్రాలు అందించి ప్రోత్సహించారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ వనజారెడ్డి, కోశాధికారి ప్రసాద్, డాక్టర్ శిల్ప, స్రవంతి పాల్గొన్నారు.

● చేగుంట : జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మండల వ్యాప్తంగా పలు పాఠశాలల్లో అంగన్‌వాడీ టీచర్లు బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. ఉపాధ్యాయులు రాధ, భవాని, శ్రీవాణి,శారధ, రేఖ, సునిత, సంధ్య, వాణి, అంగన్‌వాడీ టీచర్లు రేణుక రాంకుమారి, పద్మ, స్వర్ణలత, వాణి, సుగుణ పాల్గొన్నారు.

తెలంగాణలోనే గురుకులాల వ్యవస్థ

(5వ పేజీ తరువాయి)

తెలిందన్నారు. అప్పుడప్పుడూ తోటి విద్యార్థినులతో ఫలితాలు, మార్కుల విషయంలో పోటీ కారణంగా ఆత్మన్యూనతకు గురై కూడా కొందరు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిందన్నారు. విద్యార్థినుల ఆత్మహత్యల నివారణ కోసం తాము అనానిమస్ రూం కాన్సెప్ట్‌ను తీసుకువచ్చామన్నారు. రాష్ట్రంలోని 278 గురుకులాల్లో ఈ విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. ప్రతీ గురుకులంలో వారంలో రెండు రోజులు ఒక ఖాళీ తరగతి గదిలో టీచర్లు వచ్చి కూర్చుంటారని, వారికి విద్యార్థినులు తమ సమస్యలు చెప్పుకోవచ్చని వివరించారు. టీచర్లు వారి సమస్యలకు పరిష్కరం చూపుతారని, లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తులను చట్ట రీత్యా చర్యలు తీసుకుంటారని తెలిపారు. అంతకు ముందు అలుగు వర్షిణి విద్యార్థినులతో ముఖాముఖి మాట్లాడారు. భోజనం, బోధన, సౌకర్యాల గురించి ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి రాత్రి బస చేశారు.

సమయపాలనేదీ?

● ఇష్టారీతిన విధులకు హాజరవుతున్న హత్నూర ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది



ఖాళీగా దర్శనమిస్తున్న డాక్టర్ కుర్చీ

హత్నూర, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన హత్నూర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సమయపాలన పాటించకుండా ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతున్నారు ఇక్కడ ఒక డాక్టర్‌తో పాటు వార్డు బాయ్, ల్యాబ్ టెక్నీషియన్, ఏఎన్ఎంలు విధులు నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రంలో 24గంటలూ రోగులకు సేవలు అందించాల్సి ఉంది. సిబ్బంది సమయపాలన పాటించక పోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో కొందరు పడిగాపులు కాస్తుండగా, మరికొందరు తప్పని పరిస్థితుల్లో ప్రైవేటు క్లినిక్‌లను ఆశ్రయిస్తున్నారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు విధులకు హాజరుకావాల్సిన సిబ్బంది 9.45 నిమిషాల తరువాతా ఒక్కొక్కరు రావడం కనిపించింది. డాక్టర్ రమామణి 10గంటల వరకు కూడా విధులకు రాకపోవడం గమనార్హం. ఈ విషయమై జిల్లా వైద్యాధికారి గాయత్రిదేవిని సంప్రదించగా విధుల నిర్వహణలో సమయపాలన పాటించని సిబ్బందికి మెమోలు జారీ చేస్తామని అన్నారు. సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

ఆకట్టుకున్న మాక్ పోలింగ్

పాపన్నపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : జనవరి 25 జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం పాపన్నపేట ఉన్నత పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహించారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు విశ్వనాథ్, రజిత, లక్ష్మి ఆధ్వర్యంలో పోలింగ్ ఏర్పాట్లు చేశారు. ఓటింగ్‌లో ఎలా పాల్గొనాలో ప్రధానోపాధ్యాయుడు మహేశ్వర్ అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు మహేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ పరీక్షలు

శివ్వంపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ క్షయ నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారులు సాయి సౌమ్య, పవన్, ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాస్, సూపర్వైజర్లు, టీబీ జిల్లా నోడల్ టీం సభ్యులు పాల్గొన్నారు.

వరినాట్లు వేసిన మహిళా ఉపాధ్యాయులు

మనోహరాబాద్ జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మనోహరాబాద్ మండలం రంగాయపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఊరి పక్కనే పొలంలో రైతులు నాట్లు వేస్తుండడంతో మహిళా ఉపాధ్యాయులు వారితో కలిసి కాసేపు తాము రైతులమంటూ వరి నాట్లు వేసి మురిసిపోయారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలుళ్లు అరుంధతీజ్యోతి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మహాత్మా గాంధీ విగ్రహావిష్కరణ



తూప్రాన్, జనవరి24(ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ పట్టణంలోని జెండా వద్ద ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ విగ్రహాన్ని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మామిళ్ల జ్యోతి కృష్ణ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు , కౌన్సిలర్లు పాల్గొన్నారు. శిలాఫలకంపై కేసీఆర్, కౌన్సిలర్ల పేర్లు లేకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. ఎస్ఐ శివానందం అక్కడికి చేరుకుని శిలాఫలకాన్ని మార్చే ప్రయత్నం చేస్తానని హామీ ఇవ్వడంతో విరమించారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

సంగారెడ్డి రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : కల్లుగీత కార్మిక సంఘం (కేజీకేఎస్) ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం 2025 క్యాలెండర్‌ను శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆవిష్కరించారు. కేజీకేఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆశన్నగౌడ్, రమేష్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

● సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ చైర్మన్ సూరిక్రిష్ణ


సమావేశంలో మాట్లాడుతున్న సూరిక్రిష్ణ

జహీరాబాద్, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్‌సర్వీసెస్ చైర్మన్ సూరిక్రిష్ణ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని మైనార్టీ కళాశాలలో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సమాచార, మోటారువాహనాల, బాలకార్మిక నిర్మూలన, బాల్యవివాహనిరోధక చట్టాలు, జువైనల్‌జస్టీస్ యాక్టు, ఉచిత న్యాయ సహాయం తదితరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్, న్యాయవాదులు మాణెన్న, విజయకుమార్, రుద్రయ్యస్వామి, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, పారాలీగల్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో రక్తదాన శిబిరం


రక్తదాన శిబిరంలో కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్టులు

సంగారెడ్డి అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్(ఏఐఓసీడీ)50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సంగారెడ్డి జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు కెమిస్ట్‌లు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య, కార్యదర్శి రమేశ్, కోశాధికారి సంతోష్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు కృష్ణయాదవ్, చంద్రమోహన్, రాజు, ఈశ్వర్, రఘుపతి, సత్యనారాయణ, సతీశ్ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణ ప్రతీ ఒక్కరి బాధ్యత

● జహీరాబాద్ ఎంవీఐ అధికారి వెంకటయ్య



ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్టీసీ డ్రైవర్లు, సిబ్బంది

జహీరాబాద్, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : రోడ్డుప్రమాదాల నివారణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని ఎంవీఐ వెంకటయ్య, పట్టణ ఎస్ఐ కాశీనాథ్ పేర్కొన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాలు, డ్రైవర్స్‌డే సందర్భంగా శుక్రవారం పట్టణంలో ఆర్టీసీ ఆధ్వర్యంలో డ్రైవర్లకు వైద్య పరీక్షలను నిర్వహించారు. అనంతరం పట్టణంలో ప్రధానరహదారిపై ర్యాలీ నిర్వహించారు. డ్రైవర్లకు ఆరోగ్యపరీక్షలను చేయించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ జాకీర్‌హుస్సేన్, డిపో సీఐ నరేందర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

బస్సుల డ్రైవర్లకు డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్‌లు

పటాన్‌చెరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పలు పాఠశాల యాజమాన్యాలు తమ బస్సుల డ్రైవర్లకు ముందస్తుగా డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించిన తరువాతే వాహనాలను అప్పగించాలని పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఉదయం ముత్తంగి ఔటర్ రింగ్ రోడ్డు జంక్షన్ వద్ద పలు ప్రైవేటు పాఠశాలల బస్సులను ఆపి డ్రైవర్లకు డ్రెంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు.

రైతు భరోసా దరఖాస్తుల స్వీకరణ

వట్‌పల్లి, జనవరి24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతు భరోసా పొందని రైతులకు పథకం అమలు కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఏవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం వట్‌పల్లిలోని రైతు వేదికలో పలువురు రైతుల నుంచి రైతుభరోసా దరఖాస్తులను స్వీకరించారు. పట్టాదారు పాసుబుక్కు కలిగి ఉండి రైతుభరోసా రాని రైతులందరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుకు ఆధార్, పట్టాదారు, బ్యాంకు పాస్ బుక్‌ల జీరాక్స్‌లు జత చేసి సమర్పించాలన్నారు.

● రేగోడు : ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకానికి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని మండల వ్యవసాయ అధికారి జావిద్ శుక్రవారం తెలిపారు. 2024 డిసెంబర్ 31 వరకు వ్యవసాయ భూమి కలిగిన రైతులు రైతు భరోసాకు ఈ నెల 26 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతుభరోసా(రైతుబంధు) పొందిన వారు బ్యాంక్ అకౌంట్ మార్పులు చేర్పులు ఉన్నా దరఖాస్తులు ఇవ్వాలన్నారు.